ప్రభుత్వ పథకాల అమలులో
అధికారుల పాత్ర కీలకం

స్థాయి సంఘ సమావేశంలో జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పి ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో అధికారుల పాత్ర ఎంతో కీలకమని జెడ్పి ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం జెడ్పి సమావేశ మందిరంలో 1, 2, 4, 7వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రగతి పథంలో నడిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు తగిన సహకారం అందించుకుంటున్నారని, తద్వారానే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పథకాలు అమలులో క్షేత్రస్థాయి పరిశీలన అవసరమన్నారు. జిల్లాకు పలు పరిశ్రమలు తీసుకురావడం జరిగిందన్నారు. తాజాగా ఎలక్ట్రికల్ బస్సుల పరిశ్రమను త్వరలోనే శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కుప్పం ప్రజలకు సాగునీరు, దాహార్తి తీర్చేందుకు కృష్ణా జలాలను హంద్రీ నీవా సుజల స్రవంతి ద్వారా కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి తీసుకు వెళ్లే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆ పనులు మరో 20 రోజుల లోపల ట్రైలర్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా విధానంలో భారత దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయనంతగా సమూలమైన మార్పులు సీఎం జగన్ తీసుకొచ్చారన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమం భారీ ఎత్తున చేపట్టడం జరిగిందని, క్షేత్రస్థాయిలో పాడి పరిశ్రమల ద్వారా మంచి ఆదాయం లభించే అవకాశం ఉందని జడ్పి సిఈవో ప్రభాకర్ రెడ్డి అన్నారు. జలజీవన్ మిషన్ పనులు జిల్లాలోవేగవంతంగా జరుగుతున్నాయని మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని అంచనాలు రూపొందించగా అధికారులు డిసెంబర్ నాటిక పూర్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో నాలుగు మండలాల్లో కరువు మండలాలుగా గుర్తించడం జరిగిందని ప్రస్తుతం ఉపాధి హామీ ద్వారా ఇస్తున్న పని దినాలను 50 శాతం పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థాయి సంఘాల సభ్యులు హాజరుకాగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు, డిఆర్‌డిఏ పిడి రవి, డ్వామా పీడీ గంగా భవాని, డిపిఓ లక్ష్మి, ఎస్ఈ విద్యుత్ శాఖ శ్రీహరి, పిడి హౌసింగ్ పద్మనాభం, డిఎల్‌డిఓ రవికుమార్, జిఎండిఐసి, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేస్తారా...?

- సాకులు చెప్పడం సరా మామూలే.. - ఉద్యోగుల్లో ఆందోళన

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

రెగ్యులర్ పోస్టు ప్రతి సంస్థలో... ప్రతి విభాగంలో...ప్రతి క్యాడర్‌లో పనిచేసే కార్మికుడు కోరుకునే కోరిక. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌ల్లో పనిచేసే కార్మికులు సైతం భవిష్యత్తుల్లో ఎప్పుడైనా పర్మినెంట్ కాకపోదా? అనే లక్ష్యంతోనే పనిచేయడం పరిపాటే. కానీ అధికారంలోకి వచ్చే పాలకులు ఆశలు చూపి, ఊరించి ఊసడిస్తారే తప్ప, పర్మినెంట్ చేసిన దాఖలాలు చాలా తక్కువ. ఇటీవల జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల్లో ఆశలు చిగురించాయి. మరీ ముఖ్యంగా టిటిడి వంటి దార్మికసంస్థల్లో రెగ్యులర్ జరుగుతుందనే ఆశకు నీరు పోస్తూ బోర్డు సైతం నిర్ణయం తీసుకుంది. కానీ అది అమలవుతుందా అనేదే పెద్ద ప్రశ్న. ఉద్యోగుల్లో సైతం ఆందోళన నెలకొనడం గమనార్హం.

పర్మినెంట్.. పర్మినెంట్.. రెగ్యులరైజేషన్.. పదం ఏదైనా ఫలితం ఒకటే. టైమ్ స్కేల్, కనీస వేతనం వంటి డిమాండ్లపై కార్మికులు రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా శతాబ్దాలుగా అనేక పోరాటాలు నడుస్తూనే ఉన్నాయి. కొంత వరకు విజయం సాధించారు. బూర్జువ రాజకీయ పాలకుల వల్ల పూర్తిస్థాయిలో కార్మికులకు న్యాయం జరగడం లేదు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మరీ దారుణంగా తయారయ్యాయి. పర్మినెంట్ కథ దేవుడెరుగు ఉన్న హక్కులను సైతం నిర్వీర్యం చేసి, కార్మికులు శ్రమను దోచుకుని, కార్పొరేట్ శక్తులకు పంచిపెట్టడమే పనిగా దేశ పాలకులు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో నిత్యం ప్రతి రాష్ట్రంలోనూ ఆందోళనను, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలో అంగన్‌వాడీలు, హెల్పర్లు సైతం తమకు కనీస వేతనాలు అమలు చేయాలని, పాలకులు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు వేతనం అదనంగా ఇవ్వాలని, మినీ వర్కర్లను, మెయిన్ వర్కర్లగా గుర్తించాలని పోరుబాట పట్టారు. డిసెంబర్‌లో సమ్మె చేసేందుకు నోటీసులు సైతం ఇచ్చారు. ఇటీవలే రాష్ట్ర మంత్రి వర్గం సమావేశమై రాష్ట్రంలోని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని నిర్ణయించి జీవో నెంబరు 144ను విడుదల చేశారు. అందుకు షరత్తులు సైతం పెట్టారు. ఆ జీవో కాపీలు ఆయా జిల్లా అధికార యంత్రానికి ఇప్పటి వరకు అందిన దాఖలాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో టిటిడి కూడా బోర్డు తీర్మానం చేసింది. టిటిడిలో జీవో నెంబరు 144ను అమలు చేయాలని, దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను (2014కు ముందు నుంచి పనిచేస్తున్న వారు) రెగ్యులర్ చేయాలని నిర్ణయించారు. ఆమేరకు టిటిడిలోని అన్ని విభాగాలకు సర్క్యులర్ సైతం జారీ చేశారు. కానీ కొన్ని విభాగాల్లో ఈ జీవోను పట్టించుకోవడం లేదు. దేవుడు వరం ఇచ్చిన పూజారి వరం ఇవ్వడన్న చందాగా తయారైంది స్విమ్స్ పరిస్థితి. స్విమ్స్ వంటి ఆసుపత్రి సైతం ఈ జీవో తమకు వర్తించదని, అక్కడ అధికారులే బహిరంగంగా చెప్పి, కార్మికులకు తామే ఏమి చేయలేమని చేతులు ఎత్తేయడం గమనార్హం. బోర్డు తీర్మానంతో కార్మికులకు ఆశలు చిగురించాయి. కానీ జరుగుతున్న పరిణమాలు చూస్తే బోర్డు తీర్మానాన్ని అధికారులు అమలు చేస్తారా అన్నది ప్రశ్న. బోర్డు నిర్ణయాన్ని షరత్తులు జోడించడంతో ప్రస్తుతం ఉన్న కార్మికుల్లో కనీసం 10శాతం కూడా అందుకు అర్హులు కారేమో అన్న అనుమానం కార్మికుల్లో రేకెత్తింది. నిజంగా కార్మికులపై ప్రేమతో ఇదంతా చేస్తున్నారు. లేక త్వరలో జరుగబోవు సాదారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టిటిడి ఉద్యోగులు, కార్మికులు ఓట్ల కోసం రాజకీమాలు చేస్తున్నారా అన్నది పెద్దప్రశ్న. వాస్తవానికి అనుభవం, అర్హత ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని బావిస్తే దశాబ్దాలుగా శేషచల అడవుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తూన్న అటవీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీసం టైమ్‌స్కేల్ వర్తింప చేయాలని డిమాండుతో కార్మికులు 1127 రోజులుగా నిరసన దీక్ష చేస్తుంటే పట్టించుకోవడం లేదు. వీరిని రెగ్యులర్ చేయాలనే గతంలో అనేక సార్లు బోర్డు తీర్మానాలు జరిగాయి. కానీ అమలు కాలేదు. తాజా ఈవో కూడా వీరికి అమలు చేసినట్లే ఉంటుందా అని కార్మికుల్లో అనుమానం రేకెత్తింది. పర్మినెంట్‌పై ఆశపెట్టుకున్న కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పర్మినెంట్ అన్నదాన్ని ఎన్నికల స్టంట్‌గా కాకుండా కార్మికుల డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని అమలు చేయాల్సి ఉంది. రెగ్యులర్ చేయకున్నా సాకులు చెప్ప కుండా కనీసం టైమ్ స్కేల్ అన్నా వర్తింప చేయాలని కార్మికులందరూ కోరుకుంటున్నారు. ఆ దిశగా టిటిడి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని, కార్మికులకు న్యాయం చేస్తుందేమో వేచి చూద్దాం.

యుటిపి కేసులు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: యుటిపి కేసులు త్వరగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు సూచించారు. శనివారం ఎస్టేట్‌లోని జిల్లా కోర్టు జడ్జి ఛాంబర్‌లో ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని యుటిపి, వివిధ రకాల కేసులకు సంబంధించి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల రెవెన్యూ, పోలీస్, అటవీ, జైలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ జైలులో మగ్గుతున్న ఖైదీలకు సంబంధించి కేసులు త్వరితగతిన పరిస్కారించుటకు సమన్వయ కమిటీ నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అక్టోబర్ 31 వరకు 43,055 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అక్టోబర్1 నుండి అక్టోబర్ 31 నాటికి 688 కేసులు డిస్పోజల్స్ చేయడం జరిగిందన్నారు. ఎన్‌బిడబ్ల్యూఎస్ కేసులు అక్టోబర్ 31 నాటికి 4352 ఉన్నాయని అందులో 1088 పోలీస్ కేసులు, 1692 ఎన్ఐ ఆక్ట్ కేసులు, 131 ఎక్సైజ్ కేసులు, 3 మెయింటినెన్స్ కేసులు, 1438 ఇతర రకాల కేసులు, 2019 నుండి 1812 ఎన్‌బిడబ్ల్యూఎస్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జిల్లాల వారిగా ఎన్‌బిడబ్ల్యూఎస్ కేసుల వివరాలు, చిత్తూరు జిల్లాలో 329 క్రిమినల్ కేసులు, 549 ఎన్ఐ ఆక్ట్ కేసులు, తిరుపతి జిల్లాలో 554 క్రిమినల్ కేసులు, 531 ఎన్ఐ ఆక్ట్ కేసులు, 131 ఎక్సైజ్ కేసులు, 3 మెయింటినెన్స్ కేసులు, అన్నమయ్య జిల్లాలో 205 క్రిమినల్ కేసులు, 269 ఎన్ఐ ఆక్ట్ కేసులు, 343 ఇతర రాష్ట్రాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో గత సెప్టెంబర్ 30 నాటికి ఎన్‌బిడబ్ల్యూఎస్ 4,455 కేసులు పెండింగులో ఉన్నాయని, అక్టోబర్ 31 నాటికి 4,352 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి,సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 31 నాటికి 103 కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ మూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్, డిఆర్ఓ.యన్.రాజశేఖర్, జిల్లా జైల్ సూపర్ డెంట్ వేణుగోపాల్ రెడ్డి, అటవీశాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి, డిఎస్పీ శ్రీనివాస్ మూర్తి. తిరుపతి, అన్నమయ్య జిల్లాల రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానిదే భవిష్యత్తు

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో ఎపి రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయకుమార్

ప్రజాశక్తి-చిత్తూరు: ప్రకృతి వ్యవసాయానిదే భవిష్యత్తు ఆ దిశగా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్, ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు విజయ్‌కుమార్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై శనివారం అధికారులతో ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజంలో రసాయన ఎరువుల వినియోగం ఎక్కువైందని తద్వారా భూమిలో సారవంతం కోల్పోయి పంట ఉత్పత్తుల్లో పౌష్టిక విలువలు తగ్గిపోతున్నాయన్నారు. తద్వారా అనేక అనర్థాలు చోటు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. ఆహారంలో ఉండాల్సిన పోషకాలు సరైన మోతాదులో లేకపోతే ఆరోగ్య వంతమైన సమాజం మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంద న్నారు. రోజు రోజుకు రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో పంట ఉత్పత్తుల్లో పోషక విలువలు క్రమేనా తగ్గిపోతున్నాయన్నారు. రసాయన ఎరువులవినియోగం వల్ల భూసారం నశిస్తుందని కావున వ్యవసాయ విధానంలో మార్పురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యదేచ్ఛగా రసాయనాలు వినియోగం కొన సాగితే మరో ప్రకృతి ప్రళయం వచ్చి భూమిలో ఉన్న అనేక జీవరాసులు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు బాధ్యగా వ్యవహరించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ విధానంపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడాలంటే ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమనన్నారు. కార్యక్రమంలో చిత్తూరు నుంచి డిఆం డిఏపిడి తులసి, డిఎల్ఎంపి శ్రీనివాసరావు, డిపిఎం రవి, సరితారెడ్డి, ఏపిఎంలు మధు, సూరి, ఖాదరవల్లి పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి విశేష కృషి

- జెడ్పి వైస్ ఛైర్మన్ రమ్య

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని జిల్లా పరిషత్ 6వ స్థాయి సంఘ ఛైర్మన్, జెడ్పి వైస్ ఛైర్మన్ రమ్య అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘ ఛైర్మన్ రమ్య మాట్లాడుతూ షెడ్యూలు కులాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఎంత గానో కృషి చేస్తోందన్నారు. విదేశీ విద్య ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. చేదోడు, కాపు నేస్తం, ఈబిసి నేస్తం వంటి పథకాల ద్వార సహాయం చేయడం జరుగుతోందన్నారు. గిరిజన సంక్షేమం కోసం అనేక పథకాలతో పాటు భూ పంపిణీకి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

కార్యక్రమంలో జెడ్పి సీఈవో ప్రభాకరరెడ్డి, ఐసిడిఎస్ జెడ్పి స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ భారతి, జిల్లా వ్యవ సాయా ధికారి మురళికృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వ కృషి

- జెడ్పి వ్యవసాయ స్థాయి సంఘ ఛైర్మన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని జెడ్పి వ్యవసాయ స్థాయి సంఘ ఛైర్మన్ బి.ధనంజయరెడ్డి అన్నారు. విత్తనం కొనుగోలు నుంచి అమ్మకం వరకు అన్ని విధాల సహకరించేందుకు సిబ్బంది ఉన్నారని, వారి సలహాలు తీసుకొని వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం వ్యవసాయ అనుబంధ రంగానికి సంబంధించిన స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ ఎపిఎంఐపి ద్వారా ఈ ఏడాది 6500హెక్టార్లలో పంటలకు డ్రిప్ పరికరాలు ఇవ్వాలని భావించగా ఇప్పటి వరకు 5000హెక్టార్లకు చేరుకోవడం జరిగిందన్నారు. జగనన్న పాల వెల్లువకు సంబంధించి ఈ నెల 25లోపల మూడు బిఎంసిలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అధికారులు వివరించారు. పాల ధరల విషయంలో అమూల్ డైరీ ధరలు అధికంగా ఇస్తోందని వెంటనే పాల సేకరణ ప్రారంభించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో ప్రభాకర్‌రెడ్డి, జెడ్పి వైస్ ఛైర్మన్ రమ్య, ఐసిడిఎస్ జెడ్పి స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ భారతి, బిసి కార్పొరేషన్ ఈడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. ప్రతి పౌరుని హక్కు..

- సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్

ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకుంటున్న జడ్జి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఓటు హక్కు పొందడం పౌరుల బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్ అన్నారు. ఓటు నమోదు కోసం జడ్జి శనివారం దరఖాస్తు చేసుకున్నారు. సీనియర్ సివిల్ జడ్జి బంగ్లాలో చిత్తూరు నియోజకవర్గ ఈఆర్ఓ, ఆర్డీవో చిన్నయ్య, ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ అరుణలు జడ్జికి కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం–6 దరఖాస్తు అందించారు. అయన దరఖాస్తును నింపి, సంతకాలు చేసి, అవసరమైన ధ్రువపత్రాలను జత చేసి ఈఆర్ఓ, ఏఈఆర్వోలకు అందించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు, ఓటు వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు నమోదుపై కళాశాలలో, విద్యాసంస్థల్లో అవగాహన కార్య క్రమాలు నిర్వహించడంతో పాటు, ప్రత్యేకంగా ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు అధికారులు వివరించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి పాల్గొన్నారు.

చరిత్ర అధ్యయనానికి గ్రంథాలయాలు ఆవశ్యకం

సదస్సులో మాట్లాడుతున్న చైతన్య సాహితి సమితి అధ్యక్షులు నాగిరెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అనాది కాలం నుంచి అక్షర లిఖితమైన గ్రంథాలు మన సంస్కృతిని, చరిత్రను తెలియజేసేలా ఉన్నాయని చైతన్య సాహితి సమితి అధ్యక్షులు నాగిరెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయ కేంద్రంలో శనివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని 'సాహిత్య సదస్సు' నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సమితి అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనానికి ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. విశిష్ట అతిథి జి.సలీం మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు గురించి, ఉచిత సేవలను గురించి విద్యార్థులకు వివరించారు. పిసిఆర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ చరిత్రలో జరిగిన పోరాటాలన్నీ విజ్ఞాన సముపార్జన చేసిన పుస్తకాల ద్వారానే మొదలైయ్యాయన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు, రచయితల సంఘం మాజీ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ చదువు మనుషులను జ్ఞానవంతులుగా మారుస్తుందన్నారు. గ్రంథాలయ అధికారులు లలిత, మధుబాబు, గుణశేఖర్, బిలాల్, రాజ్‌కుమార్, పూర్ణిమ, తులసికుమార్, దేవిబాల, సరస్వతి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఓటరు జాబితాలో పేరు లేనివారు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వారు ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఆర్ఓ, ఆర్డీవో చిన్నయ్య, ఏఈఆర్వో, కమిషనర్ డా. జె అరుణ పిలుపునిచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ– 2024 కార్యక్రమం డిసెంబర్ 9వ తేదీ వరకు జరుగుతుందని, డిసెంబర్ 2, 3వ తేదీలు (శని, ఆదివారాలు) ప్రత్యేక ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమాలు పోలింగ్ కేంద్రం వద్ద జరుగుతుందన్నారు. జనవరి 1, 2024కు 18 సంవత్సరాల పూర్తి చేసుకునేవారు ప్రస్తుతం కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం –6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓటు హక్కు కోసం వారి తల్లిదండ్రులు విద్యార్థుల మార్కుల లిస్ట్ ను ఫారం –6తో పాటు సమర్పించి ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో, బిఎల్ఓ వద్దనున్న ఓటరు జాబితాలో పేర్లు సరి చూసుకోవాలన్నారు. సవరణలు ఉంటే సరైన ధ్రువపత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదు, సవరణల అవకాశాన్ని చిత్తూరు నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఆర్వో, ఏఈఆర్వోలు కోరారు.

విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అందుబాటులో ఉన్న విద్యావాకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెషర్ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఐఐటీలో శనివారం నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్, ఉల్లాస్ ట్రస్ట్ సహకారంతో ఓపెన్ స్కూల్ డేని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలు, స్కాలర్‌షిప్‌ల గురించి తెలియచేశారు. అనంతరం ఫిజిక్స్, కెమిస్ట్రీ, సైన్స్ ప్రయోగాలను దృశ్య, ఆచరణాత్మక అంశాలతో ప్రదర్శించి విద్యార్థులను ఉత్రూతలూగించారు. తదనంతరం ఐఐటీలోని అత్యాధునిక సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను వీక్షించారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎన్ఎన్ మూర్తి, ఎన్ఎస్–ఎస్ ఫ్యాకల్టీ అడ్వైజర్ దేబాశిష్ మోండల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీగా దొంగ ఓట్లు నమోదు

తక్షణమే తొలగించాలని కలెక్టర్‌కు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో వైసీపీ ప్రభుత్వం భారీగా దొంగఓట్లు నమోదు చేసిందని, వాటిని వెంటనే ఓటర్ల జాబితానికి తొలగించాలని శనివారం టిడిపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతిలో వైసీపీ నాయకులు ఆంధ్రప్రదేశ్ రావాల్సిన ఆర్థిక వనరులైన ఇసుక, యర్రమట్టి, గ్రానెట్స్ దొంగిలించి ఇతర రాష్ట్రాలకి అమ్ముతున్నారని ఆరోపించారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 17,000 దొంగ ఓట్లు చేర్చారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నరసింహ యాదవ్, గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, వెంకటగిరి మాజీఎమ్మెల్యే రామకష్ణ శ్రీకాళహస్తి నాయకులు సుధీర్ రెడ్డి, సుగుణమ్మ, పరసారత్నం, పులుగోరు మురళి కృష్ణరెడ్డి, జి.కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయం నుంచి శ్రీ పద్మావతి అమ్మవారికి సారె

రూ.2.5 కోట్లు విలువైన 5 కిలోల బంగారు కాసులమాల, యజ్ఞోపవీతం సమర్పణ

ప్రజాశక్తి- తిరుమల: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం పంచమితీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. ప్రతి ఏటా పంచమితీర్థం రోజున తిరుమల నుంచి సారె తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమలలో ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తిరుచానూరు పద్మావతి అమ్మవారి పంచమితీతం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో సంప్రదాయబద్ధంగా సారె ఊరేగింపు మొదలైందని తెలిపారు. ఈ సారె ఊరేగింపుగా కాలినడకన తిరుపతిలోని అలిపిరి, కోమలమ్మ సత్రం, తిరుచానూరు పసుపు మండపం మీదగా శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందని చెప్పారు. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు పద్మసరోవరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని తెలియజేశారు. ఈకార్యక్రమాన్ని టీటీడీ నియమనిష్టలతో భక్తిశ్రద్ధలతో అద్భుతంగా నిర్వహిస్తోందని చెప్పారు. ఈవో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయం నుండి రూ.2.5 కోట్లు విలువైన 5 కిలోల బరువు గల బంగారు కాసులమాల, యజ్ఞోపవీతం అమ్మవారికి కానుకగా సమర్పిస్తున్నట్టు తెలియజేశారు. ముందుగా శ్రీవారి ఆలయంలో ఉదయం 2.30 నుండి పరిమళాన్ని (నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన మిశ్రమం) విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం శ్రీవారి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. ఆ తరువాత ఉదయం 4.30గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణంతో కూడిన సారె ఊరేగింపు మొదలైంది. ఈ సారెను గజాలపై ఆలయ నాలుగు మాడ వీధుల గుండా ఊరేగించి అనంతరం కాలినడకన తిరుమల నుంచి తిరుపతిలోని అలిపిరి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఈవో ఎవి.ధర్మారెడ్డి ఆభరణాలతో కూడిన శ్రీవారి సారెను జెఈవో శ్రీ వీరబ్రహ్మంకు అందజేశారు. అక్కడినుండి కోమలమ్మ సత్రం, శ్రీకోదండ రామాలయం, శ్రీ గోవిందరాజ స్వామి ఆలయం, లక్ష్మీపురం సర్కిల్, శిల్పారామం నుండి తిరుచానూరు పసుపు మండపం వద్దకు సారె చేరుకుంది. అక్కడ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మాడవీధుల గుండా ప్రదక్షిణగా వెళ్లి పద్మపుష్కరిణిలో అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు అనుమతి లేదు- డిఎస్పి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: సిపిఎస్‌పై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తలపెట్టిన ఆత్మగౌరవ సభకు అనుమతి లేదని చిత్తూరు పట్టణ డిఎస్పీ శ్రీనివాసమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశాలు, సభలు, నిరసనలు నిర్వహిస్తే చట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిన్న పిల్లల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, యాప్ ద్వారా ఆహార నాణ్యత పట్ల పరిశీలిస్తోందని ఐసిడిఎస్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ భారతి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందింలో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ నూతన భవనాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందని, పలు భవనాలకు మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. పాఠశాలలతో పాటు క్షేత్ర స్థాయి కిషోర బాలికలకు అవగాహన ఆరోగ్యం పట్ల చూపడం జరుగుతో ందన్నారు. నిరంతరం గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లల ఆరోగ్యం, ఆహారం పట్ల నిఘా వుంచినట్లు తెలిపారు.

డిసెంబర్ 24న అశ్ర జాతీయ సమ్మిట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వస్తు కొనుగోలు విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలనీ, నగదు చెల్లింపు విషయంలో జవాబుదారితనం ఉండేలా బిల్లులు తీసుకోవాలని అశ్రా, కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తిరుపతి జిల్లా అధ్యక్షులు అరికింబేడు మునిశేఖర్ పిలుపునిచ్చారు.

రోడ్లుకు మరమ్మతులు చేయండి

- టిడిపి, జనసేన నేతల డిమాండ్

పాదయాత్ర చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: గుంతల పడ్డ రోడ్లుకు మరమ్మతులు చేయాలని టిడిపి, జనసేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జిటి కండ్రిగ నుంచి దేవళంపేట వరకు పాదయాత్ర చేపట్టారు. రోడ్ల దుస్థితిని వివరిస్తూ ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ పొన్నా యుగంధర్, టిడిపి మండల అధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి, మోహన్‌మురళి, చంద్రారెడ్డి, చెంగల్‌రాయులురెడ్డి, రజినీకాంత్, చంద్రబాబురెడ్డి, రమణారెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

బాలల హక్కుల గురించి తెలుసుకోవాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బాలల హక్కుల గురించి తల్లి దండ్రులు తెలుసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ జయశ్రీ, రెడ్డి కళ్యాణి అన్నారు. శనివారం మండలంలోని కీరమంద, తగువారిపల్లి సచివాలయాల్లో సమావేశం నిర్వహించారు.

రేపు వాహనాల వేలం

ప్రజాశక్తి-శాంతిపురం: ఎక్సైజ్ కేసులలో పట్టుబడ్డ వాహనాల వేలం నిర్వహించనున్నట్లు రాళ్లబుదుగూరు ఎస్ఐ సుమన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్టేషన్‌లో ఎక్సైజ్ కేసుల్లో 05బైక్‌లు, కారును సీజ్ చేసినట్లు తెలిపారు. వాటికి సంబంధించి సోమవారం బహిరంగ వేలం నిర్వహించన్నుట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వేలం పాటదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా సూరసంహార వేడుకలు

ప్రజాశక్తి-నగరి: పట్టనంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో సూరసంహారం పూజలు వైభవంగా జరిగాయి. కరకంతేశ్వరస్వామి ఆలయంలో వళ్లిదేవసేన సమేత ఆరుముగ స్వామికి చందన, పంచామృతాభిషేకాలు చేసి సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై హారతులు అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గార్మి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో ముస్లింలు శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో గార్మి పండుగ జరుపుకున్నారు. అల్లాకు ప్రీతికరమైన జెండాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం వాటిని ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్ధనలు చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని రాళ్లబుదుగూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెం.82/2 లో 4.88 ఎకరాల విస్తీర్ణం ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆ గ్రామస్తులు తహశీల్దార్‌కు విన్నవించారు. శనివారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ గ్రామస్తులు మాట్లాడుతూ కొంత మంది ఆ భూమిపై కన్నేసి పట్టాలు పొందేందుకు చూస్తు న్నారని ఆరోపించారు. కాగా ప్రభుత్వ భూమిని పరిశ్రమలు, ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించాలని కోరారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. శనివారం ఎస్ఆర్ పురం మండలంలోని దుకాణాలను ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది లోకనాథం, సూపర్‌వైజర్‌లు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-రామకుప్పం: స్థానిక పంచాయతీలోని వెటర్నరీ సిబ్బంది శ్రీనివాసులురెడ్డి తల్లి పద్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం వైసిపి నేతలు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎంపిపి సుబ్రమణ్యం, సర్పంచ్ మురళి, నాయకులు చంద్రారెడ్డి, కుందనందనారెడ్డి, కృష్ణప్రసాద్, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్డెమ్మకి నివాళి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కైగల్ గ్రామానికి చెందిన టిడిపి ఎస్సి సెల్ నియోజకవర్గ కార్యదర్శి మునెప్ప సతీమణి రెడ్డెమ్మ వారం రోజులప్పుడు కొండి జెర్రి కాటుకు గురైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నేతలు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు కిషోర్‌గౌడ్, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసమూర్తి, రమేష్, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సోమల: ప్రజా సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు రూరల్ సిఐ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఇరికిపెంట గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికార పార్టీపై ఇక ఉమ్మడి పోరు

- మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి



ప్రజాశక్తి-వి.కోట: ప్రజా వ్యతిరేక విధాలు అవలంభిస్తున్న అధికార వైసిపిపై ఇక టిడిపి, జనసేన ఉమ్మడి పోరుకు సిద్ధ పడినట్లు మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతమాకులపల్లి, చిన్నాగనపల్లి పంచాయతీలలో శనివారం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై అన్యాయంగా అక్రమ కేసులు, అరెస్టులు పెట్టడమే కాకుండా పరామర్శించడానికి వెళుతున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను అడ్డుకున్న సంఘటనలు రాక్షసపాలనకు అద్దం పడుతోందన్నారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందంటే కేవలం ఏపినే అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు రివర్స్ టెండరింగ్‌తో రివర్స్ పాలనకు శ్రీకారం చుట్టారని విమర్శించారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంస పాలన సామాన్యుడు భయబ్రాంతులకు గురిచేసే పరిస్థితికి తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ నీడ్స్ జగన్ కాదని.. ఏపీ హేట్స్ జగన్ అని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులను అన్యాయం చేసిన ఈ ప్రభుత్వాని గద్దె దించేందుకు యువతరం తిరుగుబాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రంగనాథ్, కుప్పం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ సురేష్, నాయకులు రాంబాబు, సతీష్‌నాయుడు, ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

వెదురుకుప్పంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: 56వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వాస రచన పోటీలు జరిగాయి. శనివారం గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యపై గ్రంథాల యాల యొక్క ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్న పూర్ణ శారద చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశా రు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకరరావు, గ్రంథా లయశాఖ అధికారి సతీష్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు వెంక టేష్, పిడి భరణినాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమల: 56వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిన్నారులలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో సృజనాత్మకతను వెలికి తీయవచ్చునని ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రామకృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సదుం: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి వెంకటరమాణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నడిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు హరినాథ్, ధనంజయరాజు పాల్గొన్నారు.

నగరి: స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 56వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని అధికారులు నైపుణ్యతా పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించగా 40 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గురుమూరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదుంలో విద్యార్థులకు వ్యస రచన పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

బడ్జెట్ లక్ష్యం పూర్తి చేయండి

- సిబ్బందికి డ్వామా పీడీ ఆదేశం

ప్రజాశక్తి-చిత్తూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంనకు సంబంధించి క్లస్టర్స్ వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. శనివారం డిఆర్డిఏ మీటింగ్ హాల్ నందు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై చిత్తూరు క్లస్టర్ లోని చిత్తూరు, గంగాధర్ నెల్లూరు గుడిపాల,యాదమర్రి,తవణంపల్లి, పెనుమూరు, పాలసముద్రం మండలంలోని క్షేత్ర సహాయకులు సాంకేతికసహాయకులు ఈసీలు/జేఈ, ఏపీఓ లతో పీడీ, చిత్తూరు క్లస్టర్‌ఏపీడి సుబ్రహ్మణ్యంతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ ఉపాధి హామీపనులకు సంబంధించి క్లస్టర్ల వారీగా కేటాయించిన లేబర్ బడ్జెట్ పూర్తి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు వీలైనంత ఎక్కువ పని దినాలు కల్పించాలని, సరాసరి వేతనము రూ.272లకు తగ్గకుండా పని కల్పించాలన్నారు. గృహ నిర్మాణ శాఖ వారు సిఫారసు చేసిన ప్రకారం 90 పని దినాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. హార్టికల్చర్ మెటీరియల్ పేమెంట్స్ పెండింగ్ లేకుండా ఫిట్టింగ్ ప్లాంటింగ్ కంప్లీట్ చేయాలనన్నారు. 2024-25 ఆర్థిక సంఘం ఆర్థిక సంవత్సరం సంబంధించిన ప్లానింగ్ సకాలంలో పూర్తి చేయించాలని ఎవరైతే 60 శాతం కంటే తక్కువ పది దినాలు కల్పించని సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందికి షోకేస్ నోటీస్ ఇవ్వాలని, పనితీరు మారక పోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, రీఛార్జ్ స్ట్రక్చర్ టు డ్రైడ్ ఆఫ్ బోర్ బోర్వెల్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్ లను స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని వెంటనే ఇచ్చిన టార్గెట్ ప్రకారం విధిగా పూర్తి చేయాలని పీడీ ఆదేశించినారు.

జంట ఏనుగుల స్వైర విహారం

- పంట పొలాలపై దాడులు
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతంలోని ననియాల గ్రామంలో జంట ఏనుగులు స్వైరవిహారం చేస్తున్నాయి. శనివారం రైతుల పంట పొలాలను ధ్వంసం చేశాయి. కోత దశకు వచ్చిన వరిపైరును ధ్వంసం చేశాయి. కళ్లెదుటే పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగుల నుంచి కాపాడుకోలేక రైతు లబోదిబోమంటూ గుండెలు బాధుకున్నాడు. సమాచారం అందుకున్న ఇరుగుపొరుగు రైతులు ఏనుగులు ఉన్న ప్రదేశానికి బాణాసంచాతో వెళ్లి ధ్వనులు చేస్తూ ఏనుగులు తరిమే ప్రయత్నం చేస్తున్నారు. కందకాలు, సోలార్ ఫెన్సింగ్ లేకపోవడంతో ఏనుగులు పంటల పైకి దూసుకొస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెనువెంటనే ఏనుగుల బెడద నుంచి పంటలు కాపాడేందుకు ప్రత్యాన్మాయ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

పాకాలను అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డిదే..

మాట్లాడుతున్న తుడ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పాకాల: చంద్రగిరి నియోజకవర్గంలో పాకాల మండలానికి రూ.70 కోట్ల నిధులు విడుదల చేసి మండలంలోని ప్రతి పంచాయతీకి రెండు నుంచి మూడు కోట్లు నిధులు విడుదల చేసి అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిదేనని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి లోకనాథం అధ్యక్షతనలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో తనకు ఇష్టమైన మండలాలు తిరుపతి రూరల్, పాకాల మండ లం అని పాకాల మండలానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటా నన్నారు. రాజకీయంలో మొట్టమొదట అడుగు పెట్టినప్పుడు మొదటి ప్రచారం పాకాల నుంచి ప్రారంభం అయిందన్నారు. ప్రచారంలో పాకాల మండ ల ప్రజలు వారి కుటుంబ సభ్యుడిగా తనను ఎంతగానో ఆదరించిన అభిమానాన్ని ఎప్పటికీ మరిచి పోనన్నారు. పాకాల మండల రుణం తీర్చుకో వాలని ఎప్పు డూ ఆలోచిస్తానని తెలిపారు. మండలంలో మనం చేసిన అభివృద్ధి ఇంకొకసారి అధికారంలోకి తీసుకుని రావడా నికి అవకాశం వుందన్నారు. ప్రజా ప్రతినిధు లుగా ఎప్పుడూ ప్రజలతో కలిసి ఒక కుటుంబ సభ్యులుగా భావించి పెళ్లి వచ్చినప్పుడు పెళ్లి కానుకలు, పండుగలు వచ్చినప్పుడు కానుకలు, కరోనా సమ యంలో మండలం లోని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని వారికి మెడిసిన్స్, పళ్ళు, కూరగాయలు, బియ్యం, సరుకులు అందించా మన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన మంచి పనులను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. నాలుగు సంవ త్సరాలుగా కనబడని ప్రతిపక్షాలు అన్నీ ఇప్పుడు వచ్చి తాము ఏదో చేస్తామని అంటు న్నారని, కానీ మండలం లోని ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని ఆలోచిం చాలన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, సింగల్ విండో చైర్మన్ మునీశ్వర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ లింగయ్య, ఎంపీపీ లోకనాథం, తహశీల్దారు భాగ్యలక్ష్మి, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా హరికృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని డికె మర్రిపల్లి పంచాయతీలో మాజీ మంత్రి గుమ్మడి కుతుహలమ్మ తనయుడు ఆనగంటి హరికృష్ణ 43వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. గ్రామస్తులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గ్రామ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగరాజ, మద్ద నాగరాజు, గంగయ్య, మోహన్ మహేంద్ర, రవి, శేఖర్ పాల్గొన్నారు.

టిడిపి, జనసేన ఆధ్వర్యంలో 'గుంతల ఆంధ్రకి దారేది?'

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం ఆంధ్ర తమిళనాడు సరిహద్దులలో టిడిపి, జనసేన ఉమ్మడిగా కలిసి 'గుంతల ఆంధ్రకి దారి ఎక్కడ?' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం జనసేన ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టరు పసుపులేటి హరి ప్రసాద్, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు సురేందర్ కుమార్, మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి లావణ్య కుమార్ నిర్వహించారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- బంగారం స్వాధీనం, నిందితురాలు అరెస్ట్

విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్పి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఆర్టిసి బస్సులో మహిళ వద్ద మరో మహిళ బంగారం అపహరించిన కేసును పోలీసులు ఛేదించారు. శనివారం చిత్తూరులో విలేకరుల సమావేశంలో డిఎస్పి రవికుమార్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 13న పుల్లూరు క్రాస్ సమీపంలో ఆర్టిసి బస్సులో మాయమాటలు చెప్పి మహిళ వద్ద మరో మహిళ బంగారం అపహరించిన కేసును దర్యాప్తు చేశామన్నారు. ఎస్ఆర్ పురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించి సిఐ సత్యబాబు, ఎస్ఐ షేక్‌షావల్లి బృందం చేపట్టిన దర్యాప్తులో చిత్తూరు లెనిన్ నగర్ మంగసముద్రంకు చెందిన రాదిక(27)ను నిందితురాలిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

నిందితురాలి నుండి 262గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కాగా ఇప్పటికే నిందితురాలిపై చిత్తూరు జిల్లాలో 6 కేసులు నమోదైనట్లు తెలిపారు.

5 శాతం వడ్డీతో విశ్వకర్మ యోజన పథకం

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన 5 శాతం వడ్డి రేటుతో రూ. 3 లక్షల వరకు కొలేటరల్ ఫ్రీ క్రెడిట్ ని సులభంగా యాక్సెస్ చేస్తుందని, 4 సంవత్సరాలు. ఇది మినిస్టీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ప్రారంభించిన కేంద్ర రంగ పథకం ఇది మార్కెట్ లింకేజ్ సపోర్ట్, స్కిల్ ట్రైనింగ్, నిర్ధిష్ట ట్రేడ్ లలో నిమగ్నమైన చేతివత్తుల వారికి , డిజిటల్ లావాదేవీ లకు ప్రోత్సహకం వంటి సేవలనుఅందిస్తుందని,దవీకరణ , ఆమోద ప్రక్రియ తర్వాత, దరఖాస్తుదారులు పిఎం విశ్వకర్మ పథకం క్రింద విశ్వ కర్మలుగా నమోదు చేయబడతారని మైనారిటీల ఆర్థిక సంస్థ ఈడీ చిన్నా రెడ్డి తెలిపారు.

విశ్వకర్మ యోజన ప్రధాన ఉద్ధేశం

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా కార్పెంటర్, బోట్‌మేకర్, కమ్మరి, టూల్ మేకర్, తాళాలు తయారు చేసేవారు, శిల్పి, స్టోన్ మేకర్, గోల్డ్‌స్మిత్, కుమర్మి, చెప్పులు కుట్టేవారు, చీపురు త యారు చేసేవారు, బార్బర్స్, వాషర్‌మెన్, ఫిపింగ్‌నెట్ మేకర్ (చెపల వలలు తయారు చేసేవారు) అర్హులు.

విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు

ఈ పథకంలో రుణం తీసుకోవాలంటే కనీసం 18 సంవత్సరాల వయసు ఉండాలి స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి సబ్సిడీ రుణాలు పొంది ఉండరాదు. ఐదు సంవత్సరాల లోపు పిఎం సేవానిధి, పిఎంఈజిపి, ముద్ర రుణాలు పొందిన వారు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించిన వారు అర్హులు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటే అనర్హులు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత కలిగిన వారు పిఎం విశ్వకర్మ రిజిస్ట్రేషన్ పోర్టల్ నందు ఋణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ఋణం పొందాలంటే ఇవి ఉండాలి

పిఎం విశ్వకర్మ ద్వారా 5 శాతం వడ్డీతో ఋణం తీసుకోవాలంటే ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, రేషన్‌కార్డు ఉండాలి.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఎంపిపి సుబ్రమణ్యం

ప్రజాశక్తి-రామకుప్పం: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఎంపిపి సుబ్రమణ్యం పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో డ్రైనేజీలు, వీధి దీపాలు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, సిసి రోడ్లుకు సంబంధించి చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో నాడు-నేడు పనులు, ఉపాధ్యాయుల కొరత భర్తీ చేయాలని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. పంట పొలాల్లో ఏనుగుల దాడులకు సంబంధించి నష్ట పరిహారం అందించడంలో ఆలస్యం చేయకుండా పరిహారం అందించాలన్నారు. అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించి సకాలంలో బిల్లులను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళి, కో ఆప్షన్ సభ్యులు బర్కతుల్లా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మురళి, డిటి దిలీప్, అధికారులు పాల్గొన్నారు.

క్వారీ పేలుళ్లతో భయం.. భయం!

- గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-వి.కోట: క్వారీలో భారీ పేలుళ్లతో అవస్థలు ఎదుర్కొంటున్నామని ఎంఎం కుంట గ్రామస్తులు ఆందోళనకు దిగారు. శనివారం గ్రామ సమీప ంలోని క్వారీ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. భారీ శబ్దాలు, పేలుళ్లతో భరించలేకున్నామని అసహనం వ్యక్తం చేశారు. ఇది వరకే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పుష్ప స్టీల్ కంపెనీ దాతృత్వం

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని మేర్లపాక గ్రామ పంచాయతీలో కంపెనీ స్థాపన నుంచి మేర్లపాక గ్రామాన్ని అనేక అభివృద్ధి కార్యక్ర మాలతో పాటు, సమాజ సేవ చేయా లనే ఉద్దేశంతో సేవ కార్యక్రమాలను అవలంబిస్తున్నారు. ప్రతి సంవత్సరం దీపావళి సందర్భంగా అనేక అభివృద్ధి కార్యకలాపాలతో పాటు, ఉచిత వైద్య సేవతో పాటు ఈ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు సుమారు 150 మంది పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. కంపెనీ సీఈఓ బలరాంరెడ్డి ఆదేశానుసారం కంపెనీ పిఓ సాగర్ , సర్పంచ్ కే గంగాధర్ పంపిణీ చేశారు. సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ కంపెనీ ప్రారంభం నుంచి మన గ్రామానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్ని ప్రతి సంవత్సరం కొనసాగిస్తున్నందుకు పుష్ప స్టీల్స్ ప్రైవేట్ కంపెనీ వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మన గ్రామానికి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ మన గ్రామాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళతారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేజీ గంగాధర్, ఏర్పేడు ఎంపిటిసి భరత్ కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్

ప్రజాశక్తి-పాకాల: కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్ నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిదీర్ భాష అధ్యక్షతన అకాడమిక్ అడ్వైజర్స్ చిత్తూరు సావిత్రమ్మ కళాశాల నుండి డాక్టర్ రాజ్యలక్ష్మి పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి మురళీమోహన్ రెడ్డిలు ఈ ఆడిట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యు ఏసి కోఆర్డినేటర్ రమేష్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ ఈశ్వర బాబు,వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర పాల్గొన్నారు.

అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడికి గాయాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సూళ్లూరుపేట రోడ్డు మతకముడి రోడ్డు దగ్గర ద్విచక్రవాహన దారుడు అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయమయింది. శ్రీకాళహస్తి మండలం తొడమనాడు గ్రామానికి చెందిన కేశవులు ద్విచక్రవాహనంపై సూళ్లూరుపేట రోడ్డులో శ్రీకాళహస్తికి వస్తుండగా మతకముడి రోడ్డు దగ్గర స్కూటర్ అదుపు తప్పి పడిపోవడంతో కేశవులు తలకు తీవ్ర గాయమైంది. పోలీసులకు సమచారం' ఇవ్వడంతో 108 సాయంతో శ్రీకాళహస్తి ఏరియా అసుపత్రికి తరలించారు.